# ప్రతిభకు పట్టం

- రాష్ట్ర ఉత్తమ అధ్యాపకుడిగా నరేశ్

- బోధన, పరిశోధనలకు గుర్తింపు
- నేడు హైదరాబాద్‌లో సన్మానం, పురస్కారం ప్రదానం

కమాన్‌చౌరస్తా, సెప్టెంబర్ 4: శాతవాహన యూనివర్సిటీ పరిధిలోని ఎస్సారార్ కాలేజీ కామర్స్ విభాగంలో అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ బూర్ల నరేశ్‌కు అరుదైన గౌరవం దక్కింది. రాష్ట్రస్థాయి ఉత్తమ అధ్యాపకుడిగా ఎంపిక చేసింది. డాక్టర్ బూర్ల నరేశ్‌ది జగిత్యాల జిల్లా కోరుట్ల. ఆయన 2013, జనవరి 1న అప్పటి పబ్లిక్ సర్వీస్ కమిషన్ ద్వారా అసిస్టెంట్ ప్రొఫెసర్ హోదాలో డిగ్రీ కళాశాల అధ్యాపకుడిగా నియామకం అయ్యారు. 12 ఏండ్లుగా కామర్స్ సబ్జెక్టు బోధనతో పాటు, పాఠ్య పుస్తక రచయితగా 5 పుస్తకాలను రచించడంతో పాటు 20 జాతీయ అంతర్జాతీయ జర్నల్స్‌లో తన పరిశోధనన పత్రాలను ప్రచురించారు. ఢిల్లీ, భువనేశ్వర్, అహ్మదాబాద్, గ్వాలియర్‌లలో జరిగిన జాతీయ అంతర్జాతీయ సెమినార్లు, కాన్ఫరెన్స్‌లలో పాల్గొన్నారు. గతంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల మెట్‌పల్లి, కోరుట్లలో పనిచేసి అకాడమిక్ పరంగానే కాకుండా పరిపాలన సంబంధమైన పదవులు వైస్ ప్రిన్సిపాల్, అకాడమిక్ కోఆర్డినేటర్, దోస్త్ కోఆర్డినేటర్, జాతీయ సేవ పథకం ప్రోగ్రాం ఆఫీసర్‌గా విధులు నిర్వర్తించారు. ఈ క్రమంలో ఆయన్ను తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం కళాశాల విద్యాశాఖ రాష్ట్ర స్థాయి పురస్కారానికి ఎంపిక చేసింది.

## టాటా లైఫ్ ఇన్సూరెన్స్ రూ.5 కోట్ల క్లెయిమ్



రూ.5 కోట్ల చెక్కును అందిస్తున్న టాటా లైఫ్ ఇన్సూరెన్స్ ప్రతినిధులు

విద్యానగర్, సెప్టెంబర్ 4: టాటా ఏఐఏ లైఫ్ ఇన్సూరెన్స్ కంపెనీలో టర్మ్ పాలసీ తీసుకున్న ఓ వ్యక్తి కుటుంబానికి రూ.5 కోట్ల క్లెయిమ్ అందింది. కరీంనగర్ పట్టణం జ్యోతినగర్‌కి చెందిన అంతగిరి రాజు ఐదేళ్ల కింద రూ.5 కోట్ల కవరేజ్ టర్మ్ పాలసీ తీసుకున్నాడు. అయితే ఇటీవలే అనారోగ్యంతో మృతిచెందాడు. అతనికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. కాగా, నామినిగా ఉన్న అతని భార్య శశికళకు రూ.5 కోట్ల చెక్కును సీనియర్ బ్రాంచ్ మేనేజర్ రామకృష్ణారెడ్డి బుధవారం అందజేశారు. ఈ సందర్భంగా బీఎం మాట్లాడుతూ ప్రతి కుటుంబ పెద్ద బాధ్యతగా టర్మ్ ఇన్సూరెన్స్ తీసుకుని, ఆర్థిక భద్రత చేకూర్చుకోవాలని సూచించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ మేనేజర్ వీరస్వామి, ఆదర్శ్ కుమార్, సుమలత, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

## కాంట్రాక్టర్లతో చర్చలు సఫలం

- గణేశ్ నవరాత్రి ఏర్పాట్ల పనుల్లో పాల్గొనేందుకు సుముఖం

కార్పొరేషన్, సెప్టెంబర్ 4: కరీం'నగరం'లో గణేశ్ నవరాత్రుల ఏర్పాట్ల కోసం పిలిచిన టెండర్ పనుల్లో పాల్గొనేందుకు మున్సిపల్ కాంట్రాక్టర్ల సంక్షేమ సంఘం సుముఖత వ్యక్తం చేసింది. గతంలో చేసిన పనులకు సంబంధించి బిల్లులు చెల్లించకపోవడంతో టెండర్లను బహిష్కరిస్తున్నట్లు కాంట్రాక్టర్లు పేర్కొనడంతో బుధవారం కార్పొరేషన్ ఈఈ యాదగిరి వారితో చర్చలు జరిపారు. కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లిస్తామని ఆయన హామీ ఇవ్వడంతో నిమజ్జన ఏర్పాట్ల టెండర్లలో పాల్గొనాలని నిర్ణయించినట్లు సంఘ కన్వీనర్ మహేందర్ పేర్కొన్నారు. ఈ పనులకు సంబంధించి ఈ నెల 6 లోగా షెడ్యూల్ దాఖలు చేసేందుకు అధికారులు గడువు పొడిగించినట్లు పేర్కొన్నారు.

## నేడు ఉపాధ్యాయులకు పురస్కారాలు

కమాన్‌చౌరస్తా, సెప్టెంబర్ 4: జిల్లాలో ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన 44 మందికి గురువారం ఉదయం కలెక్టరేట్ ఆడిటోరియంలో పురస్కారాలు ప్రదానం చేయనున్నట్లు డీఈఓ సీహెచ్ జనార్ధన్ రావు ప్రకటనలో తెలిపారు.

## నగునూర్ గురుకుల డిగ్రీ కాలేజీలో స్పాట్ అడ్మిషన్స్

కరీంనగర్ రూరల్, సెప్టెంబర్ 4: నగునూర్ మహిళా గురుకుల డిగ్రీ కాలేజీ ఫస్టియర్‌లో ఎస్సీ విద్యార్థినులకు స్పాట్ అడ్మిషన్లు తీసుకుంటున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ టీ మాలతి తెలిపారు. 5, 6 తేదీల్లో కాలేజీలో సంప్రదించాలని సూచించారు.














